

గూడెంలో భారీ వర్షం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. 9:30 గంటల ప్రాంతంలో వాతావరణంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకుంది. తొలుత చిరు జల్లులు పడ్డాయి. సుమారు 10:30 గంటల నుంచి ఈదురుగాలులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంతో జనం కొద్దిసేపు సేదతీరారు.

ఇదేం విద్యా విధానం..!



- గత వైసిపి ప్రభుత్వంలో ఆరు రకాలు.. ఇప్పుడు 9 రకాల స్కూళ్లు
- ఉమ్మడి పశ్చిమలో 2,921 స్కూళ్లకుగాను బేసిక్ స్కూళ్లే 2,341
- తెలుగు మీడియంను పూర్తిగా ఎత్తేసిన కూటమి ప్రభుత్వం
- 1 నుంచి 8వ తరగతి వరకూ తెలుగు పోస్టు లేని వైనం
- ఇప్పటి వరకూ తెలుగులో చదివిన విద్యార్థుల పరిస్థితి అయోమయం
- డ్రాపవుట్స్ భారీగా పెరిగే అవకాశం ఉందని విద్యావేత్తల ఆందోళన
- స్కూళ్ల క్రమబద్ధీకరణలో కొత్తగా 35 స్కూళ్లు మూత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన తొమ్మిది రకాల స్కూళ విద్యావిధానంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో ఆరు రకాల స్కూళ్లు అమలు చేయగా, కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి తొమ్మిది రకాల స్కూల్స్ విధానాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వం చేపట్టిన స్కూళ్ల క్రమబద్ధీకరణలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొత్తగా 39 స్కూళ్లు మూతపడనున్నాయి. స్కూళ్లు మూసివేస్తూ అద్భుతమైన విద్యావిధానం తెచ్చినట్లు ప్రభుత్వం చెప్పడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కాకుండాపోయింది. గత ప్రభుత్వం తెలుగు మీడియంలో విద్యా బోధనపై ఆంక్షలు విధించడంపై అప్పట్లో కూటమి నేతలు పవన్‌కల్యాణ్, లోకేష్ తదితరులు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రవ్యాప్తంగా దీనిపై అప్పట్లో పెద్దదుమారమే రేగింది. ప్రాథమిక విద్య తెలుగులోనే జరగాలనే నినాదం అప్పట్లో మార్మోగింది. తాము వస్తే తెలుగు మీడియంలోనే ప్రాథమిక విద్య కొనసాగుతుందని ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం తెచ్చిన విద్యావిధానంలో పూర్తిగా తెలుగు మీడియంను ఎత్తివేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సైతం తీసేయడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. నిన్నటి వరకూ తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులు ఒక్కసారిగా ఇంగ్లీష్ మీడియంలోకి మారడం అత్యంత కష్టమైన పని అని చెప్పొచ్చు. దీంతో విద్యార్థుల డ్రాపవుట్ల సంఖ్య పెద్దఎత్తున ఉంటుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇది ఒకరకంగా పేద పిల్లలకు విద్యను దూరం చేయడమేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యావిధానంలో కూటమి ప్రభుత్వం తెచ్చిన మార్పులపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతోపాటు విద్యావేత్తలు సైతం తీవ్రంగా తప్పుపడుతున్నారు. కూటమి ప్రభుత్వం తెచ్చిన తొమ్మిది రకాల స్కూళ్ల విధానంలో బేసిక్ స్కూళ్లే అత్యధికంగా ఉన్నాయి. ఇక్కడ 20 మంది వరకూ ఒక టీచర్ ఆ తర్వాత 60 మంది వరకూ ఇద్దరు టీచర్ల కేటాయింపుపైనా చర్చ సాగుతోంది. భవిష్యత్తులో ఈ స్కూళ్లన్నీ మూతపడే పరిస్థితి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పేద పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యావిధానంలో మార్పులతో ఇక నుంచి తొమ్మిది రకాల స్కూళ్లు అమల్లోకి రానున్నాయి.

తొమ్మిది రకాల స్కూళ్లు ఇలా

ప్రభుత్వం రూపొందించిన తొమ్మిది రకాల స్కూళ్ల విధానంలో మొదటిది శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్. ప్రాథమిక పాఠశాలలకు ఒక కిలోమీటర్ కంటే ఎక్కువ దూరంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను ఈ పేరుతో పిలుస్తారు. ఇవి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్కటి కూడా లేనట్లుగా గుర్తించారు. రెండోది ఫౌండేషన్ స్కూళ్లు. వీటిలో ప్రీప్రయిమరీ-1, 2తోపాటు 1, 2 తరగతులు ఉంటాయి. ఇవి జిల్లాలో 315 వరకూ ఏర్పాటవుతున్నాయి. మూడోది బేసిక్ ప్రయిమరీ స్కూళ్లు. వీటిలో ప్రీప్రయిమరీ-1, 2తోపాటు ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఉంటాయి. ఇవి జిల్లాలో 1,508 వరకూ ఉండనున్నాయి. నాలుగోది మోడల్ ప్రయిమరీ స్కూళ్లు. ఈ విధానంలో ప్రీప్రయిమరీ-1, 2తోపాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఉంటాయి. ఇవి జిల్లాలో 528 ఉండనున్నాయి. ఐదో రకం ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీప్రయిమరీ-1, 2తోపాటు ఒకటి నుంచి ఎనిమిది తరగతులు ఉంటాయి. ఇవి జిల్లాలో 84 ఉన్నాయి. ఆరో రకం హైస్కూళ్లలో ఆరు నుంచి పదో తరగతి వరకూ ఉంటాయి. ఇవి జిల్లాలో 391 ఉండనున్నాయి. ఏడో విధానం హైస్కూళ్లలో ఒకటి నుంచి పది వరకూ తరగతులు ఉంటాయి. ఇవి జిల్లాలో 41 ఉన్నాయి. ఎనిమిది, తొమ్మిది రకాల్లో హైసూల్ ప్లస్, ఆరు నుంచి 12 తరగతులు, ఒకటి నుంచి 12 తరగతులు ఉండనున్నాయి. ఇవి జిల్లాలో 54 వరకూ ఉండనున్నాయి. మొత్తం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2,921 స్కూళ్లు కొనసాగనుండగా అందులో 2,341 బేసిక్ స్కూళ్లు ఉండటం గమనార్హం.

కొత్త విద్యావిధానంలో ఉమ్మడి పశ్చిమలో స్కూళ్లు ఇలా..

శాటిలైట్ స్కూళ్లు	0
ఫౌండేషన్ స్కూళ్లు	315
బేసిక్ ప్రయిమరీ స్కూళ్లు	1,508
మోడల్ ప్రయిమరీ స్కూళ్లు	528
అప్పర్ ప్రయిమరీ స్కూళ్లు	84
హైస్కూళ్లు	391
హైస్కూళ్లు బిపిఎస్ (1-10 అండ్ 1-12)	41
హైస్కూళ్లు ఎంపిఎస్ (1-10 అండ్ 1-12)	54
మొత్తం స్కూళ్లు	2,921

ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రయోగశాలగా మార్చొద్దు


పిఆర్‌విఎస్.సాయివర్మ, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి, భీమవరం



ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ప్లస్ టు పాఠశాలలు మొత్తం నాలుగు రకాల పాఠశాలలు మాత్రమే ఉండాలి. దీనిపై ఇప్పటికే ఎస్‌టియు పక్షాన ప్రతిపాదించాం. అయితే తొమ్మిది రకాల పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ విద్యను ప్రయోగశాలగా మారుస్తున్నారు. అందులో ఉపాధ్యాయుల కేటాయింపులో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఒక్కోరకంగా ఉండడం సరైన నిర్ణయం కాదు. తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన మన రాష్ట్రంలో తెలుగు మీడియం కొనసాగించకపోవడం దుర్మార్గం.

పాఠశాలల రేషన్‌లైజేషన్ విద్యారంగంపై తీవ్ర ప్రభావం

పిఎస్.విజయరామరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, భీమవరం



పాఠశాలల రేషన్‌లైజేషన్ పేరుతో తొమ్మిది రకాల స్కూళ్లు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతోంది. జిఒ కూడా జారీ చేసింది. దీని ప్రభావం పాఠశాలలు, విద్యార్థులపై తీవ్రంగా పడుతుంది. ఫౌండేషన్ స్కూళ్ల వల్ల ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ప్రతిచోటా బేసిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి. ప్రతి పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహించాలి. ప్రతి 20 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలి. ఇంగ్లీష్ మీడియంతోపాటు తెలుగు మీడియంను సమాంతరంగా నిర్వహించాలి. హైస్కూళ్లలో 45 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఏర్పాటు చేసి కొనసాగించాలి.

ఫౌండేషన్ స్కూల్ వ్యవస్థతో ప్రాథమిక విద్య నిర్వీర్యం

పివిఎస్ఎస్‌బి.రమణారావు, ఎపిటిఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి, భీమవరం



పక్క స్కూల్ నుండి తరగతులను విలీనం చేయకుండా 45 లేదా ఆపైన రోల్ ఉన్న పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చాలి. ఫౌండేషన్ స్కూల్ వ్యవస్థ వల్ల భవిష్యత్తులో ప్రాథమిక విద్య నిర్వీర్యమై పాఠశాలలు మూతపడే అవకాశం ఉంది. జిఒ 117 రద్దు అంటూనే మరోవైపు కొన్ని ఉన్నత పాఠశాలల్లో 1 నుండి 10 తరగతులు ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలల శ్రేయస్సు దృష్ట్యా 1 నుండి 5 తరగతులను కేవలం ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలి. ప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థను కొనసాగించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు మీడియం కొనసాగించాలి.

పాలిసెట్‌లో 'రూట్స్' ప్రభంజనం

120 మార్కులతో రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంకు సాధించిన యశ్వంత్ పవన్‌సాయిరామ్

ప్రజాశక్తి - తణుకు



యశ్వంత్‌ను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

బుధవారం సాయంత్రం విడుదలైన ఎపి పాలిసెట్ ఫలితాల్లో రూట్స్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి 120/120 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి మార్కు సాధించారని స్కూల్ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి తెలిపారు. రూట్స్ స్కూల్‌కు చెందిన అడిన యశ్వంత్ పవన్ సాయిరామ్ 120కి గాను 120 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 18 ర్యాంకు సాధించాడని తెలిపారు. అలాగే కె.చక్రధర్ 118 మార్కులు సాధించి 82వ ర్యాంక్, ఎఎస్ఎస్.కోటేశ్వరరెడ్డి 173 ర్యాంకు, సిహెచ్‌సి.సాయి మీనాక్షి 302వ ర్యాంకు, యు.హన్సిత పద్మిని 360వ ర్యాకు, సిహెచ్ శృతి 690వ ర్యాంక్, ఆర్.మహేశ్వరి 1056వ ర్యాంకు, సి.మొహన్య 1710 ర్యాంకు సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు రూట్స్ స్కూల్ డైరెక్టర్స్ సుధాకర్ వర్మ, బి.విద్యాకాంత్, ఎల్‌కె త్రిపాఠి, ఉపాధ్యాయులు ఎస్‌కె.ఖాసిం, పివిఎస్.దాస్, పి.మునేశ్వరరావు అభినందనలు తెలిపారు.

అత్యవసర పరిస్థితులపై అవగాహనకే మాక్‌డ్రిల్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

మాక్‌డ్రిల్ అవగాహనతో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడంతోపాటు ఆపదలో ఉన్నవారికి సాయం చేయడానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు ఏ విధంగా స్పందించాలి, ఏ విధంగా తమను తాము రక్షించుకోవాలి, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పరిసర ప్రాంత ప్రజలను ఏ విధంగా అప్రమత్తం చేయాలి అనే అంశాలపై ఎస్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, వైద్యశాఖలు సంయుక్తంగా బుధవారం స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ సమక్షంలో మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, తుపాను, వరదల సమయంలో ప్రజలు ఏవిధంగా స్పందించాలి, ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే వివిధ అంశాలపై అవగాహన కల్గించేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించడం కోసం భవిష్యత్తులో ఇటువంటి మాక్‌డ్రిల్ కార్యక్రమాలు మరిన్ని చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ నుండి గ్యాస్ లీకేజీని సిఓ2 ద్వారా, మన దగ్గర ఉన్న బకెట్‌తో ఏ విధంగా మంటలను కట్టడి చేయవచ్చో కలెక్టర్ స్వయంగా చేసి చూపించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ అనుకోని సంఘటనలు జరిగినప్పుడు అప్పటికప్పుడు ఏ విధంగా స్పందించాలో తెలియదని, దానివల్ల అనేక అనర్థాలు జరుగుతాయని అన్నారు. ఎస్‌డిఆర్ఎఫ్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖలు సమన్వయంతో మాక్‌డ్రిల్ చక్కగా నిర్వహించారన్నారు. మాక్‌డ్రిల్ వాస్తవ సంఘటనలను ప్రతిబింబించేలా ఉండటంతో బస్టాండ్‌కు వచ్చి, పోయే ప్రయాణికుల్లో ఏం జరిగిందో అనే ఆందోళన కనిపించింది. జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఎ.శ్రీనివాసరావు ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, ఎఎస్‌పి వి.భీమారావు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌డిఆర్ఎఫ్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఎ.శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వర ప్రసాద్, డిఎస్‌పి ఎం.మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, ఆర్ఎస్ఐ రఘు, ఎస్‌డిఆర్ఎఫ్ బృందం కాకినాడ, రెవెన్యూ, విద్యుత్, మెడికల్, పోలీస్, అగ్నిమాపక శాఖ మున్సిపల్, ఆర్‌టిసి తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఎంఎల్ఎ రాధాకృష్ణ అభినందనలు

ప్రజాశక్తి - భీమవరం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

కలెక్టర్ చదలవాడ నాగరాణి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం క్యాంపు కార్యాలయంలో తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మానవతా సేవల్లో చూపిన విశేష కృషికి గుర్తింపుగా కలెక్టర్ నాగరాణి రెడ్‌క్రాస్ రాష్ట్ర అవార్డు పొందడం జిల్లా వాసులకు గర్వకారణమన్నారు. వరదల సమయంలో కలెక్టర్ స్వయంగా నష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని తక్షణ సహాయం అందించడంలో ఆమె తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. ఈ అవార్డు ఆమె సేవాభావానికి, మానవతా కార్యక్రమాలపై ఉన్న నిబద్ధతకు గుర్తింపుగా నిలుస్తోందని కొనియాడారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన మురళీకృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం



మంత్రి మనోహర్‌ను కలిసిన చిన్నా

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను అమరావతిలోని సచివాలయంలో బుధవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్నా) మర్యాదపూర్వకంగా కలిశారు. డిసిఎంఎస్ ఛైర్మన్‌గా నియమితులైన మురళీకృష్ణ మంత్రిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఇచ్చిన పదవులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తానన్నారు.

టార్గెట్‌తో సంబంధం లేకుండా ధాన్యం కొనాలి

ఎపి కౌలురైతుల సంఘం

ప్రజాశక్తి - ఆచంట



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో టార్గెట్ విధానాన్ని పెట్టడంతో జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మిల్లర్లు, కొన్నిచోట్ల రైతుసేవా కేంద్రాలు టార్గెట్ అయిపోయిందని చెప్పడంతో రైతులు ధాన్యం అమ్మే పరిస్థితి లేక తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో బుధవారం పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంకా లక్షా యాభై వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం ఉందన్నారు. అనేక చోట్ల మిల్లర్లు టార్గెట్ అయిపోయిందని ధాన్యం దింపుకోవడం లేదని, కొన్నిచోట్ల రైతుసేవా కేంద్రాల్లో టార్గెట్ అయిపోయిందని చెబుతున్నారని తెలిపారు. ఒకపక్క వాతావరణం బాగోలేకపోవడంతో రైతులు అయినకాడికి దళారులకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1153 రకం ముక్కైపోతుందని మిల్లర్లు దింపుకోమంటున్నారని, లేదంటే బస్తాకు ఐదు కిలోల ధాన్యం ఇవ్వాలని రైతులను మోసగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణం బాగోలేని పరిస్థితుల్లో టార్గెట్‌తో సంబంధం లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. దీంతో సివిల్ సప్లయిస్ డిఎం టి.శివరామప్రసాద్‌తో మాట్లాడగా ఇంకా 60 వేల టన్నులకు టార్గెట్ ఉందన్నారు. రైతులెవరూ ఆందోళన పడొద్దంటున్నారని, అయితే క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని రామాంజనేయులు కోరారు. కార్యక్రమంలో కౌలురైతులు కొండేటి సత్యనారాయణ, కొండేటి సురేష్, గుబ్బల నాగరాజు, కడలి శేఖర్, కొండేటి వెంకటేశ్వరరావు, వేంద్ర మనోహర్ పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి..!

తాగునీటి చెరువు సమీపంలో చేపల చెరువు తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ఏలూరుపాడు గ్రామస్తుల ఆవేదన



ఏలూరుపాడు గాంధీ బజారులో చేపల చెరువు తవ్వుతున్న వైనం

ప్రజాశక్తి - కాళ్ల

నిబంధనలకు విరుద్ధంగా రెండు పంటలు పండే వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చేస్తున్నారు. చేపల చెరువులు తవ్వేస్తున్నా.. అధికారులు చోద్యం చూస్తుండడంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్ల మత్తులో జోగుతూ చేపల చెరువుల తవ్వకాల వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరుపాడులో తాగునీటి చెరువుకు సమీపంలో నివాసాలకు ఆనుకుని చేపల చెరువుల తవ్వకాలు జోరుగా సాగుతున్నా మత్స్య, రెవెన్యూ, పంచాయతీ, భూగర్భ జలాలు, ఇరిగేషన్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని ఏలూరుపాడులో గాంధీ బజారులోని పంట భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ నేతల అండదండలతో చేపల చెరువులు తవ్వుతునట్లు తెలుస్తోంది. చేపల చెరువులు తవ్వకుండా నిలుపుదల చేయాలని గ్రామస్తులు పలుసార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఏలూరుపాడులో 10 వేల మంది జనాభాకు తాగునీరు అందిస్తున్న పంచాయతీకి చెందిన తాగునీటి చెరువు పక్కనే చేపల చెరువు తవ్వకానికి మత్స్య, రెవెన్యూ, భూగర్భ జలాలు, ఇరిగేషన్ శాఖల అధికారులు అనుమతులు ఇవ్వడం గమనార్హం. ఏలూరుపాడులో గాంధీ బజారులో పంట భూములు ఆర్ఎస్ నంబర్ 230-1, 246-3, 231-1, 234-2డిలో 22 ఎకరాలు, 246-1, 234-2బి, 2ఎ, 246-3ఎలో 20 ఎకరాలకు 2023, 2024 సంవత్సరాల్లో చేపల చెరువుల తవ్వకాలకు అనుమతులు వచ్చాయి. చేపల చెరువు తవ్వకంతో తాగునీటి చెరువు కలుషితం అవుతోందని గ్రామస్తులు గ్రామ పంచాయతీ సర్పంచి జగ్గరాజు, గ్రామ కార్యదర్శులకు విన్నవించారు. 2023లో చేపల చెరువులు తవ్వకూడదని పంచాయతీ వారు తీర్మానం చేశారు. పలు సార్లు చేపల చెరువుల తవ్వకాలకు ప్రయత్నించినా గ్రామస్తులు ప్రతిఘటిస్తూ పోరాటం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మేడే రోజున ఏలూరుపాడు వాసులు చెరువు తవ్వకాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చేశారు. 15 రోజుల క్రితం గాంధీ బజారును ఆనుకుని ఉన్న 42 ఎకరాలకు పైగా సారవంతమైన భూమిలో ఆక్వా చెరువు తవ్వడానికి ప్రయత్నాలు జరిగాయి. ఇటీవల సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ ఏలూరుపాడులో తాగునీటి చెరువుకు సమీపంలో తవ్వుతున్న చేపల చెరువు పనులను పరిశీలించారు.

పర్యావరణంపై ప్రతికూల ప్రభావం..

ఈ తవ్వకాల వల్ల గ్రామంలోని తాగునీటి, బావులకు నష్టం వాటిల్లుతోంది. పర్యావరణం కూడా దెబ్బతింటోంది. చెరువుల తవ్వకాలు పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఏలూరుపాడు ప్రజలకు కలుషిత నీరే దిక్కు. ఫలితంగా ప్రజలు కిడ్నీ, కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు గురయ్యే అవకాశాలున్నాయి.

భూగర్భ జలాలు కలుషితం..

ఈ పంట భూములను ఆనుకుని 150 నివాస గృహాలు ఉన్నాయి. చేపల చెరువుల తవ్వకం వల్ల భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతాయి. గృహాల సెప్టిక్ ట్యాంకులు మొత్తం నిండి పోయి ప్రజలు ఇబ్బంది పడతారు. ఈ ప్రాంతంలో తాగునీటి బోర్లు, బావులు సుమారు 11 ఉన్నాయి. సుమారు 200 నుంచి 300 వందల గజాల్లోపే తాగునీటి చెరువు ఉంది. చేపల చెరువులు తవ్వకం వల్ల తాగునీటి చెరువులోని నీరు పాడవుతుంది.

ఉప్పుటేరు పోటు..

2020-21లో వచ్చిన వరదల కారణంగా ఉప్పుటేరు పొంగి పంట భూములన్నీ పొంగి నివాస ప్రాంతాల వరకూ నీరు వచ్చిన సంఘటనలు ఉన్నాయి. చేపల చెరువులు తవ్వితే వరదలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఎక్కువగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య కారకంగా ఉన్న చేపల చెరువుల తవ్వకాలను నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చేపల చెరువు తవ్వకం ఆపాలి..


నల్లగచ్చు నాగార్జున, ఏలూరుపాడు గ్రామస్తుడు



చేపల చెరువు తవ్వడం వల్ల ఏలూరుపాడు గ్రామ పంచాయతీ తాగునీటి చెరువు కలుషితమవుతుంది. అంతేకాకుండా కలుషిత వాతావరణం, దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడతారు. ఏలూరుపాడులో గ్రామ పంచాయతీ తాగునీటి చెరువుకు సమీపంలోని సర్వే నంబర్లలోని వ్యవసాయ భూముల్లో చేపల చెరువులు తవ్వకుండా నిలుపుదల చేయాలని జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు ఫిర్యాదు చేశాను. ఈ భూముల్లో శాశ్వత ప్రాతిపదికన నాన్ ఆక్వా జోన్‌గా ప్రకటన చేయాలి.

మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - నరసాపురం



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఉద్యోగోన్నతి పొందారు. ప్రస్తుతం గ్రేడ్-2 కమిషనర్‌గా ఉన్న ఆయనకు గ్రేడ్-1 కమిషనర్ ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్యకు సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా సచివాలయ సిబ్బంది బాధ్యతతో కూడిన ఉత్తమ సేవలు ప్రజలకు అందించాలన్నారు. ఎపి గ్రామ వార్డు సచివాలయం, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నరసాపురం పట్టణ కమిటీ అధ్యక్షులు టి. సుబ్బలక్ష్మి, సెక్రటరీ పులఖండం వాసు, జాయింట్ సెక్రటరీ కూనా ప్రభూజీ, ట్రెజరర్ శ్రీకృష్ణవంశీ, సభ్యులు ఎం.చంద్రకళ, ఎం.నరేష్, కె.సత్య శాంతి, యు.మౌనిక పాల్గొన్నారు.


పెదఅమిరంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

వేసవి దృష్ట్యా ప్రయాణికులు, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు పెదఅమిరంలో రతన్‌టాటా విగ్రహం వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్, ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు అన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచి జవ్వాది కిషోర్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, సుబ్బరాజు కోరా రామ్మూర్తి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం చేస్తాయని, ఆలయాల వద్ద ఇటువంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బుధవారం చలివేంద్రాన్ని ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించారు. ఏటా మావుళ్ళమ్మ దేవస్థానం సభ్యులు దాతల సహకారంతో ఏర్పాటు చేయడం శుభ పరిణామమని తెలిపారు. వేసవిలో ప్రతిష్ఠాత్మక ప్రధాన కూడలిలో ఇటువంటి మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ బుద్ద మహాలక్ష్మి నగేష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ కారుమూరి సత్యనారాయణ మూర్తి, రావాడ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని బాటసారి దాహార్తిని తీర్చేందుకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు సీమకుర్తి మహేష్ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఏపిఎంకు వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

దేశవ్యాప్త సమ్మెలో విఒఎలు పాల్గొనాలి

ప్రజాశక్తి - నరసాపురం

కార్మిక హక్కులను భంగం కలిగించే విధంగా ఉన్న లేబర్ కోడ్‌ల రద్దు కోసం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో విఒఎలందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఏపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో వెలుగు ఏపిఎం జక్కంపూడి నాగ భూషణం నాయుడుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ లేబర్ కోడ్లు రద్దు చేయాలని, విఒఎ కాలపరిమితి సర్క్యూలర్ రద్దు, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పని భద్రత కల్పించాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన విఒఎలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వి.సాయి దుర్గా భవాని, ఎం.స్వర్ణలత, జి.గిరి లక్ష్మి, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 2వ వార్డులో డ్రెయినేజీ పూడిక తీత పనులను మున్సిపల్ కమిషనర్ అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు సమస్యలు లేకుండా చేయడానికి డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టామన్నారు. రానున్న వర్షాకాలంలో దోమల సమస్య రాదని, తద్వారా ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా ఉండాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. చెత్త వేయడం వల్ల మురుగునీరు ఎక్కడికక్కడే ఉంటుందని, తద్వారా రోగాలు వ్యాపిస్తాయని తెలిపారు. మున్సిపాల్టీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వేంద్ర ప్రసాద్ పాత్రుడు, డిఇ ప్రవీణ్‌చంద్ర, ఎఇ నవ్య, కిషోర్, ఆర్‌ఓ కె.విశ్వనాథ, సచివాలయ సిబంది పాల్గొన్నారు.

శ్రద్ధగా నేర్చుకుంటే ఆంగ్ల భాష సులువే

ప్రజాశక్తి - పెనుమంట్ర

శ్రద్ధగా నేర్చుకుంటే ఆంగ్ల భాష చాలా సులువుగా వస్తుందని విశ్రాంత ఆంగ్ల టీచర్ పడాల సువర్ణ గౌరి అన్నారు. బుధవారం మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 16వ రోజు శాఖా గ్రంథాలయంలో ఆమె పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించారు. గ్రంథాలయ మాష్టర్ పిటిఎస్.కుమార్ పిల్లల చేత గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదివించారు. ఈ శిబిరంలో విద్యార్థులు జి.సాకేత్, కె.తనూషా, వై.రేష్మ, జి.దర్శిత్, డి.యజ్ఞశ్రీ, బి.హాసిని, డి.నేహా శ్రీఎం.కుందన్, పి.బాల ఆదిత్య, పి.భవిష్య, కె.శివ, సి.మోహన్, జి.కార్తిక్, సహాయకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో ఎంటియు 1318 విత్తనాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంగణంలో ఎంటియు 1318 రకం ఫౌండేషన్ విత్తనం అమ్మకానికి సిద్ధంగా ఉందని అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. 25 కిలోలకు గాను రూ.1,050 ధర నిర్ణయించినట్లు తెలిపారు. సెలవు రోజుల్లో మినహా ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకూ అమ్మకాలు సాగుతాయని తెలిపారు. అదనపు వివరాల కోసం శాస్త్రవేత్త ఎన్.వెరోనిక 8985059378 నంబరును సంప్రదించాలని కోరారు.

స్వర్ణాంధ్రలో ఎన్‌సిసి వార్షిక ట్రెయినింగ్ క్యాంపు

ప్రజాశక్తి - నరసాపురం


కమాండర్ రోహిత్ కుమార్

స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 7 ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి వార్షిక ట్రెయినింగ్ క్యాంపు ప్రారంభమైంది. ఈ క్యాంపును సెవెన్ ఆంధ్ర నావెల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ రోహిత్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ క్యాంపునకు ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆరు కళాశాలలు, మూడు పాఠశాలల బాల బాలికలు 210 విద్యార్థులు వచ్చారన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ 10 రోజుల పాటు క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆల్ ఇండియా నవ సైనిక్, ఆర్‌టిసిలకు సెలక్షన్ జరుగుతుందన్నారు. క్యాంపులో పది రోజుల పాటు క్యాడెట్స్‌కు బోటు పుల్లింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, మెడిటేషన్, స్పోర్ట్స్, స్విమ్మింగ్, గన్ ఫైరింగ్, డ్రిల్, షిప్ మోడలింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలతో పాటు ప్రయివేటు విద్యా సంస్థల నుండి కూడా ఎన్‌సిసిని ఏర్పాటు చేసేందుకు మక్కువ చూపుతున్నాయన్నారు. ఎన్‌సిసిలో సర్టిఫికెట్లు ఉంటే చదువు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు.

విజయవంతంగా వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జన విజ్ఞాన వేదిక సహకారంతో పత్తి వీరాస్వామి పిల్లలకు ఏ టు జెడ్ వరకు ఫ్రెండ్స్ మీద వచ్చే పేపర్లు, నీతి కథలు, పుస్తకాలు చదివించారు. ఆర్.నాగేంద్ర కుమార్ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఇంగ్లీష్ గ్రామర్‌ను బోధించారు. గరికపాటి బాపయ్య శర్మ విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డే మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. గ్రంథాలయాధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు గ్రంథాలయానికి వచ్చి వేసవి శిక్షణ తరగతులను ఉపయోగించుకునే విధంగా చూడాలని తల్లిదండ్రులను కోరారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో సభ్యత్వం కట్టి పుస్తకాలను ఇక్కడ తీసుకెళ్ళాలని తెలిపారు.

విలువలతో కూడిన విద్య 'భాష్యం'తోనే సాధ్యం



భాష్యం స్కూల్

స్కూల్ ప్రిన్సిపల్ ఎన్.వెంకట అప్పారావు



ప్రజాశక్తి - పెనుగొండ

విలువలతో కూడిన విద్య భాష్యంలోనే సాధ్యమని ఆ స్కూల్ ప్రిన్సిపల్ ఎన్.వెంకట అప్పారావు తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 2012లో పెనుగొండలో ప్రారంభించిన తమ విద్యా సంస్థ అంచెలంచెలుగా ఎదుగుతూ, ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి సంవత్సరమూ తమ విద్యార్థులు అనేక మంది జెఇఇ మెయిన్స్, ఐఐటి, నీట్, ఎయిమ్స్‌లో ఆల్ ఇండియాలో 58, 33 వంటి ప్రతిష్టాత్మక ర్యాంకులు సాధించి, జాతీయస్థాయి ఉత్తమ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. తమ విద్యార్థులు కట్టా పవన్ నరసింహ, ఆసుసత్య, ఆసు ఇందుప్రియ, కంబాల చంద్రశేఖర్, పిండి హేమ నాగమణి, అడ్డగర్ల జాహ్నవి, అత్యం వల్లిశ్రీ, నెక్కంటి నిశాంత్, మానుకొండ తేజస్వి, నిమ్మకాయల సాయి చంద్ర, పోలుపర్తి రాంప్రతాప్, నెక్కంటి నవీన ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది ఆణిముత్యాలు తమ విద్యార్థులేనని తెలిపారు. తమ విద్యాసంస్థలో ప్రాథమిక స్థాయి నుండే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ఒత్తిడి లేని విద్యాబోధన, మానసిక ఉల్లాసానికి క్రీడలు నిర్వహిస్తున్నామని చెప్పారు. స్కూల్లో విశాలమైన క్రీడా మైదానం ఉందని తెలిపారు. యోగా, కరాటే, సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు తెలిపే విధంగా కార్యక్రమాలు, నైతిక విలువలను తెలిపే విధంగా పేరెంట్స్ డే, గ్రాండ్ పేరెంట్స్ డే, రాఖీ, ఫ్రెండ్షిప్ డే, టీచర్స్ డే, వైజ్ఞానిక యాత్రలు, పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దూర ప్రాంత విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఏటా మాదిరిగానే 2025-2026 ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్


భీమవరం టౌన్ : కూలీలతో మాట్లాడుతున్న ఇంజేటి శ్రీనివాస్

ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు తెలిపారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో పర్యటించి కూలీలతో మాట్లాడారు. వారాల తరబడి వేతనాలు చెల్లించడం లేదని కూలీలు ఆయన వద్ద వాపోయారు. దీనిపై సోమరాజు మాట్లాడుతూ అంబానీ అదానీ వంటి ప్రపంచ కోటీశ్వరులకు రూ.12 లక్షల కోట్లకు పైగా అప్పులు రద్దు చేశారని తెలిపారు. పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీ చట్టానికి మాత్రం మొండి చేసి చూపుతున్నారని విమర్శించారు. పనిచేసిన రెండు వారాల్లోపు వేతనాలివ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదని తెలిపారు. ఏ రోజు కూలి డబ్బులతో ఆ పూట బతికే వ్యవసాయ కూలీలకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న జరగనున్న జాతీయ సమ్మెలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బుర్ర కనకదుర్గ, కంకిపాటి రామారావు, పెరుమాళ్ల దుర్గాప్రసాద్, సనమండ్ర రామాంజనేయ, మిద్దె ఆంజనేయులు పల్గొన్నారు.

భీమవరం టౌన్ : ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని, రూ.600 వేతనం చెల్లించాలని, ఈనెల 20న దేశ వ్యాప్త సర్వత్రిక సమ్మెలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నాగిడిపాలెంలో ఉపాధి హామీ పని ప్రాంతానికి వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ నీరు గరుస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని, రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని, కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, పనిముట్లు, మెడికల్ కిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి 20న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు, కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగిడి గోవిందమ్మ, పూర్ణచంద్రరావు, తిరుమాని శ్రీరాములు, గోపయ్య, రామారావు, సురేష్ పాల్గొన్నారు.

యలమంచిలి : ఉపాధి హామీలో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శిరగాలపల్లి, పెనుమర్రు గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను బుధవారం ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, అలాగే కనీస వేతనం రోజుకు రూ.600 అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహాలక్ష్మి, కుమారి జి.నాగేశ్వరరావు, వి.కుమారి, పి.కవరం, బి.జానకీదేవి, దావీదు మరియమ్మ, సుబ్బారావు పాల్గొన్నారు.


యలమంచిలిలో..

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తణుకు


ఆచంటలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఈనెల 20న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కార్మికులకు సమ్మె కరపత్రాలు పంపిణీ, గ్రూప్ మీటింగ్ జరిగింది. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ప్రతాప్ మాట్లాడుతూ ఎన్నో విషయాలపై కమిటీలు వేసే ప్రభుత్వాలు కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవనంపై ఒక అధ్యాయన కమిటీ వేయడం వల్ల ఎన్నో విషయాలు బయటకొస్తాయని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పర్మినెంట్ స్థానాల్లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వాళ్లతో ఎలాంటి సౌకర్యాలు లేకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాల్లో ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గార రంగారావు, మధు, సతీష్, శేఖర్, రాముడు, లక్ష్మణుడు, రాజు, సూరిపండు, నర్సింహమూర్తి, మహేష్, కరుణాకర్, సజీవరాజు, సత్యనారాయణ, బాబూరావు పాల్గొన్నారు.

ఆచంట: లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు, ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కోబోతున్నారని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆచంటలో ఈ నెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా సాధించుకున్న హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్లకు బహుళ కంపెనీలకు అమ్ముడుపోయి కార్మికులకు అండగా ఉన్న అనేక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను నాశనానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం అతి దారుణమని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో కార్మికులు, కర్షకులు ఉద్యోగస్తులు లేకుండా సమాజం ముందుకు పోదని, కేంద్ర ప్రభుత్వం ఇది గమనించకుండా కొద్దిమంది కోటీశ్వరుల కోసం లేబర్ కోడ్లను తీసుకురావడం హేతురహితమన్నారు. ఈ నెల 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బండి రంగారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కేత నాగాంజనేయులు, సిర్రా నరసింహమూర్తి, చొప్పల మోహన్, మన్నే బ్రహ్మయ్య, ఇళ్ల సత్యనారాయణ, కె.వంశీ, మంగతాయారు, సత్యవతి, బేబీ కుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

సిబిఎస్ఇ ఫలితాల్లో
భారతీయ విద్యా భవన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిబిఎస్ఇ పది, ఇంటర్ ఫలితాల్లో భీమవరం భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని భవన్స్ ఛైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ్‌రాజు, సెక్రటరీ ఎస్.శ్రీరామరాజు తెలిపారు. బుధవారం భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో జిల్లా రైస్ మిల్లర్స్ సహకారంతో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను భవన్స్ యాజమాన్యం అభినందించారు. పదిలో సిహెచ్‌ఎంవి.శ్రీకార్తిక్ 488 (98 శాతం), ఆర్.సాయి శ్రీరామ్ 482, ఎస్.కీర్తన 482, సాయి, పి పాండ 471 మార్కులతో ప్రతిభ కనబరిచారని తెలిపారు. సిబిఎస్ఇ 2లో కె.హంసిక 477 మార్కులతో జిల్లాలోనే మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. వారితోపాటు విఎల్ చెక్రిష్ 459 మార్కులు, ఎ.ఆదర్శ్ 456, జిజ.ప్రణీత్ వర్మ 410, చిరాగ్ అగర్వాల్ 407, కె.ధర్మ తేజ 394 మార్కులతో సాధించారని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కొత్త శ్రీనివాస్, డైరెక్టర్ ఎం.సత్యనారాయణ మూర్తి, రఘుపతి రాజు, ప్రిన్సిపల్స్ సురేష్ బాలకృష్ణన్, వైస్ ప్రిన్సిపల్ పద్మ, పవన్, కంతేటి వెంకట రాజు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

సర్వేకు వ్యాపారులు సహకరించాలని కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. మున్సిపాల్ ఆఫీసులో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ అంజయ్య అధ్యక్షతన వీధి విక్రయదారుల సర్వే ద్వారా వారి డేటాను సేకరణ, సచివాలయం వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వీధి వ్యాపారులందరూ సచివాలయ సిబ్బంది వచ్చినప్పుడు మీ బయోడేటాలో భాగంగా రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, వ్యక్తిగత పాస్పోర్ట్ ఫొటో, ఫ్యామిలీ ఫొటో వారికి ఇచ్చినట్లయితే డేటాను ఆన్‌లైన్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ త్రినాధరావు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎన్.రత్నాకర్, సిఒకె.కృష్ణప్రసాద్, డిఇఒ షణ్ముఖదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు అంత్యోదయ కార్డులివ్వాలి


ప్రజాశక్తి - ఆకివీడు

వికలాంగులకు వివాహంతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా వారికి కుటుంబ సరఫరాల పౌర సరఫరాల శాఖ రేషన్ కార్డులు మంజూరు చేయాలని వికలాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లాడి నటరాజు కోరారు. వయసుతో సంబంధం లేకుండా ఒంటరి వికలాంగులకు కూడా అంత్యోదయ సింగిల్ రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కొత్త కార్డులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో వికలాంగులకు ఈ రకమైన అవకాశం ప్రత్యేకంగా కంప్యూటర్లో కల్పించాలన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ఆలోచన చేసి వెంటనే ప్రత్యేక ఆదేశాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ఈ రకమైన నిర్ణయం తీసుకుంటే ఎందరో వికలాంగులకు జీవన భృతి ఏర్పడుతుందన్నారు.

సార్వాలో ప్రతి ఎకరాకూ సాగునీరు
తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

రాబోయే సార్వా సీజన్‌లో ప్రతి ఎకరానికీ సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత ఇరిగేషన్ శాఖాధికారులను తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ పంట కాలవల్లో ప్రధానంగా గుర్రపుడెక్క, కిక్కిస పేరుకుపోవడంతో నీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. దీనికి సంబంధించి డ్రోన్ల సాయంతో సమస్యలను గుర్తించి ఆయా ప్రాంతాలను ప్రక్షాళన చేసేలాచర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో తొలిసారి డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రయోగాత్మకంగా పంట కాల్వల ప్రక్షాళన చేపట్టనున్నట్లు తెలిపారు. ముందుగా డ్రోన్ల సాయంతో సర్వే చేసేందుకు అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.


డ్రోన్ టెక్నాలజీని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజల భాగస్వామ్యంతో దోమలను అరికట్టాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజల భాగస్వామ్యంతో దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టొచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు పేర్కొన్నారు. బుధవారం పట్టణ కడకట్ల పిహెచ్‌సి పరిధిలోని 33, 34, 35వ వార్డుల్లో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్ అండ్ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను లక్ష్మణరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేసి, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనుమానిత జ్వర లక్షణాలు ఉన్నట్లయితే ఆరోగ్య కార్యకర్త, ఆశాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రాజేశ్వరి, కృపమ్మ, జ్యోతి, దుర్గాదేవి, ఆశాలు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు. ఈ హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొనేవారు ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ ప్రాంగణంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - యలమంచిలి

గ్రామీణ ప్రాంతంలోని అర్హత కలిగిన ప్రతి కుటుంబమూ ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవచ్చుని, దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ అయ్యాయని తహశీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే మూడు సెంట్ల ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకునేవారు గతంలో ఏ ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇంటి స్థలం, ఇల్లు పొంది ఉండకూడదని, లబ్ధిదారులు బిపిఎల్ వర్గానికి చెంది తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలని తెలిపారు. దీనికి సంబంధించి ఆయా గ్రామ స్థాయిలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని తెలిపారు.

ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చినట్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఐసిడిఎస్ తణుకు ప్రాజెక్టు పరిధిలోని తణుకు నియోజకవర్గంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ఎంఎల్ఎ రాధాకృష్ణ నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను గుర్తించి నియామకాలు చేపట్టాలని, తీసుకున్న నిర్ణయం మేరకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.